# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ మాసపత్రిక

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్య వాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 10/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంధాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగి నప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యావసరం!!


రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

**P.O. Box 80, KAKINADA, A.P. 533 001**

Editor :
J. C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంచిక 6 జనవరి 1987 సంపుటి 7

## సంపాదకీయము

### క్రైస్తవునిగా యుండుటయే తేలిక

*(It gets Easier to be a Christian)*

క్రైస్తవునిగా యుండుట ఎంత కష్టమో తరచు మనకు తెలియ జేయబడుతాది; క్రైస్తవ జీవితం సులభమైనది కాదని, అనేక శోధనలు కష్టాలు ఎదుర్కొ-వలసి వస్తాదని తెలియ జేయబడ్తాది. యిది సత్యమేనా? లేకపోతే మన మిత్రులు క్రైస్తవులు కాకుండా మనము వారిని నిరుత్సాహపరచుచున్నామా?

ఆత్మకును శరీరానికిని ఒకరినొకరు జయించడానికి నిరంతర పోరాటము జరుగుచున్నదనుట సత్యమే. పౌలు ఇట్లు చెప్పాడు: "నాయందు, అనగా నా శరీరమందు మంచిది ఏదియు నివసింపదని నేనెరుగుదును. మేలైనది చేయవలెనను కోరిక నాకు కలుగుచున్నది గాని దానిని చేయుట నాకు కలుగుట లేదు. నేను చేయగోరు మేలు చేయక

చేయగోరని కీడు చేయుచున్నాను. నేను కోరని దానిని చేసిన యెడల దానిని చేయునది నా యందు నివసించు పాపమే గాని యికను నేను కాదు. కాబట్టి మేలు చేయగోరు నాకు కీడు చేయుట కలుగుచున్నదను ఒక నియమము నాకు కనబడుచున్నది. అంతరంగ పురుషునిబట్టి దేవుని ధర్మశాసనము నందు నేను ఆనందించుచున్నాను గాని వేరొక నియమము నా అవయవములలో ఉన్నట్టు నాకు కనబడుచున్నది. అది నా మనస్సు నందున్న ధర్మశాస్త్రముతో పోరాడుచు నా అవయవములలో నున్న పాప నియమములకు నన్ను చెర పట్టి లోబరచుకొనుచున్నది. అయ్యో నేనెంత దౌర్భాగ్యుడను? ఇట్టి మరణమునకు లోనగు శరీరమునుండి నన్నెవడు విడిపించును? మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచున్నాను. కాగా మనస్సు విషయములో నేను దైవ నియమమునకును, శరీర విషయములో పాప నియమమునకును దాసుడనై యున్నాను" (రోమా 7 : 19-25).

అయితే పౌలు ఇంకా ఇట్లనుచున్నాడు : "కాబట్టి యిప్పుడు క్రీస్తు యేసునందున్న వారికి ఏ శిక్షావిధియు లేదు. క్రీస్తు యేసునందు జీవమునిచ్చు ఆత్మయొక్క నియమము పాప మరణముల నియమము నుండి నన్ను విడిపించెను" (రోమా 8 : 1, 2). శరీరము ఎట్లు బలహీనమైనదో, పాత ధర్మశాస్త్రము పాపమునుండి మనలను ఎట్లు విడిపింపలేక పోయెనో, క్రీస్తు వచ్చి మనము ఈ లోకమందును రాబోవు లోకమందును రక్షింపబడునట్లు మనలను ఎట్లు విడిపించెనో పౌలు వివరించాడు.

క్రొత్తగా క్రైస్తవుడైనవాడు తన పాత అలవాట్లను మాని ప్రేమించుటకు, విశ్వసించుటకు, ప్రభువుకు విధేయత చూపుటకు నేర్చుకొనుటలో, ఈ నూతన జీవితానికి అలవాటు పడుటకు కొంత సమయము పట్టవచ్చును. అంతేకాదు చాలకాలము నుండి క్రైస్తవు

డైనవాడు కూడ ఈ లోక సంగతులను పట్టుకొని వ్రేలాడుచుండగా ప్రభువుకు నమ్మకముగా యుండుట కష్టమని తలంచుచుండవచ్చును. అయితే ప్రభువుకు మనము నమ్మకముగా యుండి ఆయనకు సేవ చేయుకోలది, ఆయనను మనము ఎక్కువ ప్రేమించి, నమ్మి ఈ లోకముపైని పాపముపైని విజయము కొరకు ఆయన వైపు చూడ గలము. యిది మనము క్రైస్తవులుగా యుండుటకు తేలికపర్చును. మనము ఆరాధించుటకు, నీతి నియమములు పాటించుటకు, వస్త్ర ధారణ, భాష మొదలగు కొన్ని అలవాట్లను నేర్చుకొని యున్నాము, గనుక క్రీస్తును వెంబడించుట అంత కఠినముగా మనకుండదు. మనము ఎక్కువ కాలము జీవించేకోలది, ప్రభువుయొక్క అవుసరత మన కెక్కువ యున్నదని మనము గ్రహిస్తాము; ఆయనకు నమ్మకముగా యుండే అవుసరత మనకు ఎక్కువ కన్పడగలదు.

క్రైస్తవ జీవితాన్ని జీవించగలనా యని నీవనుకొనుచున్నావా? క్రైస్తవుడు కాకుండుట కంటే క్రైస్తవునిగా యుండుటయే తేలిక. క్రైస్తవ జీవితం ఏదైనా ఒక వృత్తి వంటిదే — పాటించే కొలదీ, అది తేలిక యగును, దానిలో నీవు నైపుణ్యుడవగుదువు. దానిని ప్రయత్నించు, అది నిజంగా నీకు సాధ్యమౌతాది.

---

## కేవలము ఒక సంఘ సభ్యునిగా నుండలేవా?
### (*Why not just be a member of the Church?*)

—జె. సి. బెయిలీ

విగ్రహారాధన యనునది దేవుని ప్రజల మధ్యను అన్యజనుల మధ్యను బహు ప్రబలముగా నుండిన ఘోర పాపమని పాత నిబంధన

గ్రంథములోని చరిత్ర తెల్పుచున్నది. అట్టి విధముగా విగ్రహారాధన యుండరాదని దేవుడు స్పష్టము చేసినాడు. పది ఆజ్ఞలను యిచ్చుచు దేవుడిట్లు చెప్పెను. "నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు. పైన ఆకాశమందే గాని క్రింద భూమియందే గాని భూమి క్రింద నీళ్ళ యందే గాని యుండు దేని రూపమునైనను విగ్రహము నయినను నీవు చేసికొనకూడదు; వాటికి సాగిలపడకూడదు, వాటిని పూజింపకూడదు. ఏలయనగా నీ దేవుడనైన యెహోవానగు నేను రోషముగల దేవుడను; నన్ను ద్వేషించువారి విషయములో మూడు నాలుగు తరముల వరకు, తండ్రుల దోషమును కుమారుల మీదికి రప్పించుచు నన్ను ప్రేమించి నా ఆజ్ఞలు గైకొనువారిని వెయ్యి తరముల వరకు కరుణించువాడనై యున్నాను" (నిర్గమ 20 : 3-6). దేవుడు యింత స్పష్టముగా ఆజ్ఞాపించినప్పటికి దేవుని ప్రజలు ఎట్లు పదేపదే విగ్రహముల తట్టు తిరిగారో పాత నిబంధన చరిత్ర బయలుపరచుచున్నది. వారు తీవ్రముగా శిక్షింపబడి పిమ్మట దేవునియొద్దకు తిరిగివచ్చి మరల విగ్రహారాధనను చేయుచుండిరి.

దేవుడు చివరకు వారి విగ్రహారాధనకు ఫలితముగా శిక్షించుటకు దాసత్వములోనికి వారి నంపెను. దాస్యములో నుండి రెండు గోత్రములు మాత్రమే తిరిగివచ్చిరి. మిగిలిన గోత్రములలో శేషము మాత్రము మిగిలి యుండినది. వారు పాఠమును నేర్చుకొనిరి. వారు విగ్రహములను ఆరాధింపక మానిరి. నేటివరకు యూదులు అనేకమైన తప్పిదములను చేయుచున్నప్పటికి విగ్రహాల జోలికి మాత్రము వెళ్ళరు.

పాపము చేసినప్పుడు రక్షణయొక్క ఆవశ్యకతను గుర్తింపగలమను పాఠమును వారు నేర్చుకొని యుండిరి. దేవుని ప్రజలు చెరనుండి తిరిగి వచ్చిన తరువాత పాత నిబంధన గ్రంథమును హెబ్రీ భాషనుండి గ్రీకు భాషలోనికి అనువదించిరి. నేటి సాహిత్య ప్రపంచములో

అంగ్లమునకు ఎంతటి గొప్ప స్థానమున్నదో నాడు గ్రీకు భాషకుగూడ అంతటి స్థానముండెడిది. ఆ బైబిలు గ్రంథమును చదువుట వలన దేవుని ప్రజలనేకులు యేసుక్రీస్తు వచ్చునప్పటికి విగ్రహారాధికులుగా నుండలేదు. యూదా మత విశ్వాసమునుకూడ వారు అవలంబింపలేదు గాని పాత నిబంధనలో వ్రాయబడిన దేవుని మాత్రము నమ్మిరి. అ.కా. 10వ అధ్యాయములో గల కొర్నేలి ఇందు విషయమై మనకు మంచి మాదిరిగా యున్నాడు. ఇట్టి విశ్వాసమును ఎందుకు యూదులు త్వరితముగా అంగీకరింపలేదో మనకు తెలియదు. నేటి కాలమందుగూడ బైబిలును గూర్చిన విశ్వాసము ఎచ్చట ప్రబలముగా నుండునో అచ్చట విగ్రహారాధనకు తావుండదు.

దేవుడొక్కడే యని పాతనిబంధన బయలుపరచుచున్నది. క్రొత్త నిబంధనయైతే ఆ సత్యమును యింకా స్పష్టముగా తెలియ జేయుచున్నది.

## సంఘ మొక్కటే

దేవుడొక్కడే యని చెప్పిన బైబిలు గ్రంథమే సంఘమొక్కటే యని తెల్పుచున్నది. నిజమునకు అదే సత్యమును బహు విపులముగా బైబిలు బోధించుచున్నది. దేవుని పథకములో ఒకని కంటే ఎక్కువ దేవుళ్ళకు ఎట్లు తావు లేదో అదే విధముగా ఒక సంఘము కంటె ఎక్కువ సంఘములకు కూడ తావులేదు. ఆదినుండి సంఘమును గూర్చిన తలంపు దేవుని మనస్సులో నున్నది. "దేవుడు మనప్రభువైన క్రీస్తు యేసునందు చేసిన నిత్యసంకల్పము చొప్పున, పరలోకములో ప్రధానులకును, అధికారులకును, సంఘము ద్వారా తనయొక్క నానా విధమైన జ్ఞానము ఇప్పుడు తెలియబడవలెనని ఉద్దేశించి, శోధింప శక్యముకాని క్రీస్తు ఐశ్వర్యమును అన్యజనులలో ప్రకటించుటకును, సమస్తమును సృష్టించిన దేవునియందు పూర్వకాలమునుండి మరుగై

యున్న ఆ మర్మమును గూర్చిన యేర్పాటు ఎట్టిదో అందరికిని తేట పరచుటకును, పరిశుద్ధులందరిలో అత్యల్పుడనైన నాకు ఈ కృప అను గ్రహించెను" (ఎఫె 3:8-11). రెండు సత్యములు ఈ వాక్య భాగ మందు తేటగా నున్నవి. (1) సంఘము ద్వారా దేవుని యొక్క నానా విధమైన జ్ఞానము తెలియబడుట. (2) సర్వసత్యము సంఘము ద్వారా తెలియపరచబడుట. సంఘము యొక్క పని దేవుని నిత్యసంకల్పములో గలదని మనము గ్రహింపగలము.

దేవుని సంకల్పము ప్రకారము సంఘము ఒక జనమునకు మాత్రమేగాక సర్వజనాంగములకు చెందవలయును. దీనినే పరిశుద్ధాత్ముడు యెషయా ద్వారా యిట్లు పలికినాడు. "అంత్యదినములలో పర్వతములపైన యెహోవా మందిర పర్వతము స్థిరపరచబడి కొండల కంటె ఎత్తుగా ఎత్తబడును. అప్పుడు ప్రవాహము వచ్చునట్లు సర్వ జనులు దానిలోనికి వచ్చెదరు" (యెష 2:2-3). దేవుని మందిరము అనగా జీవముగల దేవుని సంఘమని పరిశుద్ధాత్మ తెల్పుచున్నాడు (1 తిమో 3:15). మరియొక మాటలో చెప్పవలెనన్న, సర్వజనులకు ఒక సంఘమును దేవుడు స్థాపించునని దీని భావమై యున్నది. పౌలు యిట్లు చెప్పెను, ఎఫెసీ 3:10, 11 ప్రకారము ఆ సంఘము అన్ని సమయములందును స్థాపింపబడును. అతడు యింకను యిట్లను చున్నాడు. "మనలో కార్యసాధకమైన తన శక్తి చొప్పున అడుగు వాటన్నిటికంటెను, ఊహించువాటన్నిటి కంటెను అత్యధికముగా చేయు శక్తి గల దేవునికి, క్రీస్తు యేసు మూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగును గాక, ఆమెన్" (ఎఫెసీ 3 : 20, 21). గనుక దేవుడు యుగయుగములు దేవుడు (కీర్తన 90:2). అందువలన సంఘము యుగయుగముల నుండి నిరంతరము నిలచి యుండును. సంఘమును మనము స్థాపించవచ్చును. అయితే దేవుని పధకములో విగ్రహారాధనకు తావులేని విధముగానే సంఘములో

మతశాఖలకు కూడ తావు లేదు. యేసు తన సంఘమును కట్టెను (మత్త 16 : 18). పాతాళలోక ద్వారములు తన సంఘము యెదుట నిలువనేరవని యేసు చెప్పెను. మానవులచే స్థాపింపబడిన మతశాఖ లన్నియు పెల్లగింపబడునని యేసు చెప్పెను (మత్త 15 : 13). యేసు క్రీస్తు వలన దేవుడు స్థాపించిన ఒకే సంఘము నిత్యము నిలుచును. అయితే ఆయనచే స్థాపింపబడని మొక్కలన్నియు పెళ్ళగింపబడును. ఈ బోధ స్పష్టముగా లేదా?

## శాఖలు సంఘము కాదు

సంఘమునకు గల వివిధ శాఖలు మతశాఖలని వాటిని సమర్థించు వారు చెప్పుచుందురు. సంఘ చరిత్రను చదివిన వారెవరైనను మత శాఖలు మానవులచే స్థాపింపబడెనని చెప్పుదురు. కొన్ని మతశాఖలు పురాతనమైనవి. కొన్ని క్రొత్తవి. అయితే అవి అన్నియు మానవులచే స్థాపింపబడినవి. గాని క్రీస్తు తన సంఘమును స్థాపించెను (మత్త 16 : 18). శరీర మొక్కటే (ఎఫెసీ 4 : 4). అ శరీరమే సంఘము. "సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచి సమస్తము పైని ఆయ నను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీ రము; సమస్తమును పూర్తిగా నింపుచున్నవాని సంపూర్ణతయై యున్నది" (ఎఫెసీ 1 : 22, 23).

దేవుడు ఖచ్చితముగా ఒక్కడే యున్నలాగున సంఘముకూడ ఒక్కటే యున్నది. యేసు యొక్క వనిని సంఘము చేయవలసి యున్నది. అది యుగయుగములు నిలుచును.

నూతన నిబంధన సంఘములో మనమొక విషాదమైన సంగతిని గమనింపగలము. వారు సంఘమునకు చెందుట మంచిదే. వారు ప్రభు తకు లోబడి అటు తరువాత మానవ సిద్ధాంతములను అనుసరించిరి.

"మీలో ఒకడు - నేను పౌలు వాడను, ఒకడు - నేను అపొల్లో వాడను, మరియొకడు - నేను కేఫా వాడను, ఇంకొకడు - నేను క్రీస్తు వాడనని చెప్పుకొనుచున్నారని నా తాత్పర్యము" (1 కొరి 1:12). ఇది తప్పు అని పౌలు చెప్పుచున్నాడు. క్రీస్తు విభజింపబడి యున్నాడా? పౌలు మీ కొరకు సిలువ వేయబడెనా! పౌలు నామమున మీరు బాప్తిస్మము పొందితిరా! మనము సంఘ సభ్యులమయినప్పటికి విభాగింపబడి యుంటిమి. అది ఎంతటి కీడును కలుగజేయునో గమనింపుము! మీలో అసూయయు కలహమును ఉండగా మీరు శరీరసంబంధమైన మనుష్య రీతిగా నడుచుకొనువారు కారా! ఒకడు - నేను పౌలు వాడను, మరియొకడు - నేను అపొల్లో వాడను, అని చెప్పునప్పుడు మీరు ప్రకృతి సంబంధమైన మనుష్యులు కారా! అపొల్లో ఎవడు? పౌలెవడు? పరిచారకులే గదా! ఒక్కొక్కరికి ప్రభువనుగ్రహించిన ప్రకారము వారి ద్వారా మీరు విశ్వసించితిరి" (1 కొరి 3:3-5). క్రీస్తుకు బదులు మనము మానవులను అనుసరించినపుడు (లేదా ఇరువుర ననుసరించినపుడు) మనము శరీర సంబంధులమని పతిశుద్ధాత్మ తెల్పుచున్నాడు. శరీర సంబంధమైన మనస్సు కలిగి యుండుట అననేమి? శరీర సంబంధమైన మనస్సు కలిగి యుండుట అనగా మరణించుట యని పరిశుద్ధాత్మ తెల్పుచున్నాడు. "శరీరానుసారమైన మనస్సు మరణము; ఆత్మానుసారమైన మనస్సు జీవమును సమాధానమునై యున్నది. ఏలయనగా శరీరానుసారమైన మనస్సు దేవునికి విరోధమై యున్నది; అది దేవుని ధర్మశాస్త్రమునకు లోబడదు; ఏ మాత్రమును లోబడనేరదు" (రోమా 8:6, 7).

దేవుడొక్కడే యని మానవుడు గ్రహించుటకు కొన్ని వందల సంవత్సరములు పట్టినది. అది సత్యమును మార్చజాలదు. ఇపుడు మానవుడు తన స్థితిని మెరుగుపరచుకొన్నాడు. బైబిలు ఉన్న తావులయందు దేవుడొక్కడే యని నేర్చుకొనుచున్నారు. ఒకే దేవుడని

మానవులు నమ్ముచున్నందున సంఘము కూడ ఒకటే యని నమ్మి
సంఘము ద్వారా దేవుని సేవింపవలెనని బైబిలు చెప్పుచున్నది.
ఈ వాక్యమును మరల గమనింపుము. "మనలో కార్యసాధకమైన
న శక్తి చొప్పున మనము అడుగువాటన్నిటి కంటెను, ఊహించు
వాటన్నిటి కంటెను, అత్యధికముగా చేయు శక్తి గల దేవునికి, క్రీస్తు
యేసు మూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ
లుగును గాక, ఆమేన్ (ఎఫెసీ 3:20, 21).

మనలో కార్యసాధకమైన శక్తి సువార్త పట్ల మనకు గల
విశ్వాసమే (రోమా 1:16). క్రీస్తు కంటె నాపట్ల భారతీయ సోదరులు
ఎక్కువ విశ్వాసము కలిగి యున్నందున వారినిగూర్చి నేను భయపడు
చున్నానని చెప్పవలెనని యున్నది. వారు ఆ విధముగానే యున్నచో
అట్టి విశ్వాసము నిష్ప్రయోజనమగు సమయము వచ్చును. సహో
దరులారా, మానవ వేదాంతములందును, పద్ధతులందును, విశ్వాస
ముంచవద్దు, అట్లున్నచో సంఘము విభజింపబడును. యేసుయొక్క
రక్తమందును నీతియందును తప్ప మరి దేనియందును నాకు నిరీక్షణ
లేదు. రమ్యమైన వాటిపై నమ్మక ముంచుటకు నేను ధైర్యము
చేయను, అయితే నేను సంపూర్ణముగా యేసు నామముపై ఆను
కొందును. ★

## నవీన స్వభావము

"...... మీ ప్రాచీన స్వభావమును వదలుకొని మీ చిత్త
వృత్తి యందు నూతనపరచబడిన వారై, నీతియు యదార్థమైన
భక్తియు గలవారై, దేవుని పోలికగా సృష్టింపబడిన నవీన స్వభావ
మును ధరించుకొనవలెను" (ఎఫె 4:23-24). క్రైస్తవులకు పౌలు
ఇచ్చిన దివ్యసందేశాన్ని ఈ వచన భాగమునందు చదువగలము.
కాగా ఎవడైనను క్రీస్తు నందున్న యెడల వాడు నూతన సృష్టి.

పాతవి గతించెను. ఇదిగో క్రొ త్తవాయెను" (2 కొరింథి 5 : 17). క్రీస్తు నందుండుట ఒక నూతన అనుభూతి. ఇది మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదల చేసి తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసులనుగా చేసిన ప్రత్యేక అనుభూతియై యున్నది (కొల 1 : 13).

ప్రాచీన స్వభావమునుండి, అంధకార సంబంధమైన అధికారము నుండి విడుదల పొంది క్రీస్తు నందుండుట గొప్ప ధన్యత. "కాబట్టి యిప్పుడు క్రీస్తు యేసు నందున్న వారికి ఏ శిక్షా విధియు లేదు (రోమా 8 : 1). "క్రీస్తు యేసు లోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతి 3 : 27). క్రీస్తు నందుండుట అంటే క్రీస్తును విశ్వసించి, మారుమనస్సు పొంది, క్రీస్తు నామమును ఒప్పుకొని బాప్తిస్మము పొందుటయే.

"మీరు చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిచిన వాని గుణాతిశయములను ప్రచురము చేయు నిమిత్తము ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును, పరిశుద్ధ జనమును దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు." (1 పేతురు 2 : 9). క్రీస్తు నందున్న వారికి కలుగు ఆధిక్యతలు ఈ వచనమునందు చదివాం.

ఒకసారి రక్షింపబడి ప్రాచీన స్వభావమందు కొనసాగుచు నూతనపరచబడని ఒక వ్యక్తికి ఈ ఆధిక్యతలు వర్తించవు. ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతనసృష్టి యను వాక్య భాగము క్రీస్తు నందున్న వాడే, నవీన స్వభావము నందు కొనసాగుచున్న వాడే ఒక నూతనసృష్టి యని బోధించుచున్నది.

విశ్వాసము, మారుమనస్సు, ఒప్పుకొనుట, బాప్తిస్మము అను ఈ విశ్వాస క్రియలలో ఏ ఒక్కదానిని తీసివేయుటకు మానవుని

అధికారము లేదు. మారుమనస్సు లేకుండ ఒకడు రక్షింపబడడు. అల్లే బాప్తిస్మము లేకుండ ఒకడు రక్షింపబడుట అసాధ్యము.

రక్షింపబడుటకు ఒక ప్రత్యేక సమయము లేక తేదీ నిర్ణయింపబడలేదు. అననీయ పౌలుతో "నీవు తడవుచేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుమని చెప్పెను" (అపొ.కా. 22 : 16). అపొస్తలుల కార్యములు 8వ అధ్యాయమందు నపుంసకుడు మార్పు చెందిన క్రమము పరిశీలించిన యెడల ఫిలిప్పు అతనికి యేసుక్రీస్తును గూర్చిన సువార్త ప్రకటించెను. వారిద్దరు నీళ్ళున్న ఒక చోటికి వచ్చినపుడు నపుంసకుడు నాకు బాప్తిస్మ మిచ్చుటకు ఆటంక మేమని అడిగి రథము నిలుపుమని ఆజ్ఞాపించెను. ఫిలిప్పు నపుంసకుడు ఇద్దరును నీళ్ళలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మ మిచ్చెను (అపొ.కా 8 : 35-38). ఈ వృత్తాంతమందు నపుంసకుడు క్రీస్తు సువార్తను వినిన రోజునే బాప్తిస్మము పొందెను. బాప్తిస్మము పొందుటకు లేదా రక్షింపబడుటకు లేదా నూతన సృష్టిగా మారుటకు గడువు లేదా ప్రత్యేక సమయములు లేవు. నేడే నీవు రక్షింపబడుటకు అనుకూలమైన దినము.

చెరసాల నాయకునికి అతని కుటుంబమునకు రాత్రి సమయములో పౌలు సీలలు దేవుని వాక్యమును బోధించిరి. ఆ రాత్రే వారు బాప్తిస్మము పొందిరి. ఈ విధముగ వారు దేవుడిచ్చిన వాగ్దానములు, ఆధిక్యతలు పొందిరి.

"స్త్రీలు కనిన వారిలో యోహాను కంటె గొప్పవాడెవడును లేడు. అయినను దేవుని రాజ్యములో అల్పుడైనవాడు అతనికంటె గొప్పవాడని మీతో చెప్పుచున్నాను" అని యేసు చెప్పెను (లూకా 7 : 28). క్రీస్తు నందున్న వారికి దేవుడిచ్చిన ఆధిక్యతను ఈ వచన భాగము మనకు విశదపరచుచున్నది.

ప్రాచీన స్వభావమును వదలుకొని, నూతనపరచబడి నీతియు, యదార్థమైన భక్తియు కలిగి దేవుని పోలికగా సృష్టింపబడిన నవీన స్వభావమును ధరించుకొనుట ఎంతటి ధన్యతయో ప్రతి మానవుడు గ్రహించవలసి యున్నది.

— E. K. V. ప్రసాదరావు చెయ్యేరు.

---

## కట్టడాలు రెండున్నవి, ఏదైనా ఒకటేనా ?

ఏ పేరైనా ఒకటే, ఏ సంఘమైనా ఒకటే. నీతి కావాలి గాని పేరులో ఏముంది ? అంటున్న వారనేకులున్నారు. ఎందువలన ? సంఘాలన్నీ ఒక్క పేరుతో కాకపోయినా అందరు క్రీస్తునే ఆరాధిస్తున్నారు గదా అని వారి నమ్మిక.

నిజానికి వాటి పునాదులు వేరు. బోధలు, సిద్ధాంతాలు, పాలనా విధానాలు మొదలగునవన్నీ ఒకదానికి ఒకటి పొసగని స్థితిలో భిన్నంగా ఉన్నవి.

ఇదంతా క్రీస్తు పరిశుద్ధాత్మ వలనే జరిగించుచు ఒకరితో ఒకరికి పోటీ పెట్టుచున్నాడని అనుకొందమా ? అదెట్లు కాగలదు ? క్రీస్తు ఒక్కడే, ఆత్మయు ఒక్కడే, పిలుపు ఒక్కటే, విశ్వాసము ఒక్కటే, నిరీక్షణ ఒక్కటే, బాప్తిస్మము ఒక్కటే, శరీరము అనగా సంఘము ఒక్కటే. ఒక్క ఆత్మయందు ఒక్క అనుగుణ్యతలో క్రీస్తు తన సంఘమును నడిపించుచున్నాడు (1 కొరి 12 : 13; ఎఫె 4 : 4). క్రీస్తు సువార్త, క్రీస్తు మార్గము, క్రీస్తు సంఘము, క్రీస్తు సత్యము, క్రీస్తు వాక్యము, క్రీస్తు బోధ, క్రీస్తు మాటలు మొదలైనవన్నియు తండ్రియైన దేవుని సంపూర్ణ నియమమగు క్రొత్తనిబంధన గ్రంథముద్వారా మానవులకు తెలుపుట దేవుని చిత్తము (2 తిమో 3 : 14-17).

గాన మనము చేయు ఆత్మసంబంధమగు సేవ, సత్యసంబంధమగు ప్రతి సిద్ధాంతము క్రొత్తనిబంధనద్వారా మాత్రము తెలిసికొని, అనుసరింపగోరినచో క్రీస్తునందు ఒక్క సిద్ధాంతము, ఒక్క నడిపింపు కలిగి ఏక భావముతో ఉండుట చాలా తేలిక. దేశమేదైనా, కాలమేదైనా, స్థితిగతులు వేరైనా క్రీస్తులో ఒక్క అడుగుజాడలందు నడువగలము. క్రీస్తు ఇట్లు చెప్పాడు: మత్త 7:24-27 లో నా దగ్గరకువచ్చి, నా మాటలు విని, నా మాట చొప్పున చేయండి. అప్పుడు మీరు కట్టిన సంఘం బండమీద స్థిరముగా ఉండి తీర్పులో సత్ ఫలితము పొందుతుంది.

అయితే నా దగ్గరకు వచ్చి, నా మాటలు చక్కగా విని, వాటి చొప్పున చేయకపోతే ఎంత ప్రయాసతో కట్టిన కట్టడమైనను తీర్పులో నిలువక కూలిపోవును.

ఈ రెండు కట్టడముల యజమానులు క్రీస్తుదగ్గరకు వెళ్లుటలోను, క్రీస్తు మాటలు వినుటలోను కలిసిమెలసి కనబడుచున్నారు. గాని క్రీస్తు మాటచొప్పున చేయుటలో విడిపోయారు.

## క్రీస్తు చెప్పిన మాట

"ఈ బండమీద నా సంఘమును కట్టుదును" (మత్త 16:18). క్రీస్తు నా సంఘము అని చెప్పినందున మనము కలిగియున్న సంఘము క్రీస్తుసంఘము అని పిలువబడుట క్రీస్తు మాటచొప్పున చేయుట యగును. అపొస్తలులు క్రీస్తు మాటచొప్పున ఆత్మ వారికి నేర్పిన విధముగా (1 కొరి 2:13), క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి అని వ్రాసారు (రోమా 16:16).

నిజమునకు నేడు మనము కలిగియున్న సంఘము లన్నియు క్రీస్తు మాటచొప్పున చేయగలిగితే తప్పక క్రీస్తు సంఘములని పిలువబడునూ, క్రీస్తు సత్యమునే ప్రకటించుచూ యుండును.

అయ్యా! అమ్మా!! ఆలోచించండి. మీరు క్రీస్తుదగ్గరకని వెళ్లుచున్నారు, క్రీస్తు మాటలని వింటున్నారు. బైబిలు చదువుట, పాటలు పాడుట ప్రార్థనలు చేయుట అన్నీ మామూలే అనుకొంటు న్నారు గాని నిజానికి మీరు క్రీస్తు మాటలచొప్పున కాక, దావీదు మాటచొప్పున డప్పులు, డోలు, వాయిస్తూ చప్పట్లు కొట్టి పాడుచు న్నారు; అది మీరు గమనించారా!

అలాగే మీరు క్రీస్తు మాటచొప్పున కాక మోషే మాట చొప్పున, మీరున్న సంఘానికి హెబ్రోను, బేతేలు, మిస్పా, మనాషె, పెంతెకొస్తు అను పేరులు పెట్టుకొని యున్నారు.

మరియూ క్రీస్తు మాటచెప్పున కాక జెకర్యా, రోవేలు మొ॥న ప్రవక్తల మాటచొప్పున జనములలో ప్రకటించి బహిరంగ ఉపవాస కూటాలు జరుపుచున్నారు (మత్త 6:16-18).

లోతుగా త్రవ్వి బండమీద పునాది వేయాలని క్రీస్తు చెప్పెను. క్రీస్తుమాట చొప్పున లోతుకువెళ్లి వలవేసిన సీమోను ఎంత విస్తారమైన చేపలను పట్టెను! (లూకా 5:4). క్రీస్తు మాటలు విని సంతోషముతో అంగీకరించిననూ వేరు లోతుకు నాటుకో లేనందున ఎంత త్వరగా ఎండి పోయెను! (మత్త 13:5,6).

మనము లోతైన వాక్యానుభవం పొందాలి. లోతుగా త్రవ్వి బండమీద కట్టబడిన సంఘం ఏది అని వెదకాలి.

క్రొత్తనిబంధన వాక్యాన్ని, క్రొత్తనిబంధన చట్టాన్ని కనుగొను టకు వాక్యము యొక్క లోతులోనికి వెళ్ళాలి. స్వప్నములను, దర్శన ములను నమ్మకూడదు. క్రీస్తు లేఖనముల ద్వారానే తన మాటలు, ఉపదేశము, మొ॥ నవి మనకు ఇచ్చెను.

భ్రమపరచు ఆత్మవలన మోసపోవద్దు సూచనలకై వెదక వద్దు. ముఖాముఖగా తెరవబడిన బైబిలునుండి క్రీస్తు మాటలను వెదకి అందున్న లోతులోని బండను, దానిపై కట్టబడియున్న సంఘమును కనుగొనండి.

ఆ సంఘం క్రీస్తు శరీరమైయుండి క్రీస్తునే శిరస్సుగా కలిగి క్రీస్తు పేరుతోనే కనబడును, వినబడును, వ్రాయబడును.

తెరవబడిన బైబిలునొద్దకు అందరిని పిలుచుచున్నాము, అందరితో కలసి చదువగోరుచున్నాము, మీరు చెప్పేది వింటాము, అడిగిన దానికి చెపుతాము. బైబిలునుండి కనుగొనే ప్రతి అంశము వినుట మా ఆశ. తప్పక రండి బండపైనే మనము కట్టబడాలి సుమా?

—పాల్ గూటం, గొల్లవిల్లి.

## ఒక ప్రత్యేక జనాంగము

దేవుని ప్రజలు ప్రత్యేకింపబడినవారై యున్నారు. పాత నిబంధనలోను, క్రొత్త నిబంధనలోను ఆయనకు ప్రత్యేకమైన ప్రజలు కలరు. పాత నిబంధనలో ఇశ్రాయేలీయులను ప్రత్యేక జనముగా చేసికొని వారికి ఒక దేశమును, ధర్మశాస్త్రమును అనుగ్రహించి వారిని పాలించి యున్నాడు. "నీవు నీ దేవుడైన యెహోవాకు ప్రతిష్ఠిత జనము ...... నిన్ను తన స్వకీయ జనముగా ఏర్పరచుకొనెను" (ద్వితీ 7:6).

క్రొత్తనిబంధనలో ఆయన ఒక జనాంగమును గాక, ఒక వర్గమును గాక ఎవరైతే క్రీస్తు వాక్యమునకు లోబడి యుందురో వారిని ప్రతిష్ఠిత జనముగా చేసికొనుచున్నాడు. క్రీస్తు ఈ లోకమునకు వచ్చి మన పాపముల నిమిత్తమై మరణించి, సమాధి చేయబడి,

మూడవ దినమున తిరిగి లేచి యున్నాడు. ఆయన వాగ్దానము చేసిన రీతిగానే సంఘము స్థాపింపబడెను (మత్తయి 16:18; అపొ.కా 2:41). సంఘములో చేర్చబడినవారు ప్రత్యేకమైన ప్రజలుగా గుర్తింపబడుదురు. ఈ ప్రత్యేకింపబడిన ప్రజలు ఏయే రీతులలో ప్రత్యేకింపబడిన వారో పరిశీలించుదము.

(1) వారు ఒక ప్రత్యేకమైన నామమును కలిగి యున్నారు :- "క్రైస్తవుడు" అను నామము వారికి ఇయ్యబడినది. ఈ మాటకు క్రీస్తును ధరించుకొనినవారు అని అర్థము. క్రొత్త నిబంధనలో మూడు పర్యాయములు 'క్రైస్తవులు' అను పదము కనుపించును. 1. "మొట్ట మొదట అంతియొకయలోని శిష్యులు క్రైస్తవులనబడిరి" (అపొ.కా. 11 : 26). 2. "అందుకు అగ్రిప్ప — ఇంత సులభముగా నన్ను క్రైస్తవుని చేయజూచుచున్నావే అని పౌలుతో చెప్పెను" (అపొ.కా. 26 : 28). 3. ఎవడైనను క్రైస్తవుడైనందుకు ... (1 పేతురు 4:16).

(2) వారు ఒక ప్రత్యేక దేవుని ఆరాధింతురు :- లోకములో అనేకమంది దేవుండ్లనబడు వారు కలరు గాని వారు దేవుండ్లు కారు. దేవునికి ఉండవలసిన లక్షణములు వారిలో లేవు. అయితే మన దేవుడు ఆత్మయై యున్నాడు. ఆయన జగత్తును అందలి సమస్తమును సృజించినవాడు. ఆయన అందరికి ఊపిరిని, జీవమును దయచేయువాడు (అపొ.కా. 17 : 24, 27).

(3) వారు ఒక ప్రత్యేకమైన పద్ధతిలో ఆయనను ఆరాధింతురు:- "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించు వారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెను" (యోహా 4 : 23, 24). వాక్యానుసారముగా ఆయనను ఆరాధింతురు. వాయిద్యములు లేకుండా పాటలు పాడుదురు. ఎందుకనగా దేవుడు వాయిద్యములు కోరలేదు గదా, వాటిని అసహ్యించుకొనెను (ఆమోసు 6 : 5). ప్రార్థన చేతురు,

వాక్యము బోధింతురు, ప్రభు రాత్రి భోజనము ప్రతి ఆదివారం తీసుకొందురు, కానుకలు ఇచ్చెదురు.

(4) వారు ఒక ప్రత్యేకమైన దినమున సమావేశమగుదురు :- ప్రభువు దినమున అనగా ఆదివారమున వారు ఆరాధన చేయుదురు. (అపొ.కా. 20:7; ప్రకటన 1:10). ఈ దినము యేసు తాను సమాధి నుండి తిరిగి లేచిన గొప్ప దినము. వారు ధర్మశాస్త్ర సంబంధమైన విశ్రాంతి దినమును ఆచరింపరు. ఎందుకనగా ధర్మశాస్త్రములోని ఆజ్ఞలు తుడుచివేయబడినవి (కొలస్స 2:13, 14).

(5) వారు ఒక ప్రత్యేకమైన నాయకుని వెంబడింతురు :- క్రీస్తే గొప్ప నాయకుడై యున్నాడు. "యేసును వెంబడించువారు చీకటిలో నడువక జీవపు వెలుగు కలిగియుందురు" (యోహా 8:12; మత్తయి 16:24).

(6) వారు ఒక ప్రత్యేకమైన సంఘములో సభ్యులు :- ఈ లోకములో అనేకమైన మానవకల్పిత సంఘములు ఎన్నో కలవు. అవి మానవులచే నిర్మింపబడినవి. వాటి సిద్ధాంతములు బైబిలుకు వ్యతిరేకములు. అయితే క్రీస్తు వాక్యమును బట్టి నిజమైన సంఘమును గుర్తించి ఆ సంఘ సభ్యులు కావలెను. క్రీస్తు తన సంఘమును కట్టుదునని వాగ్దానము చేసెను (మత్తయి 16:18). కనుక సంఘము క్రీస్తుదే. ఆయన దానికొరకై రక్తమును కార్చెను (అపొ.కా. 20:28). కనుక క్రీస్తు సంఘమునందలి సభ్యులుగా ఉన్నవారే దేవుని శిష్యులు. దానికొరకు తన్నుతాను అప్పగించుకొనెను (ఎఫెసీ 5:27).

(7) వారు ఒక ప్రత్యేకమైన గ్రంథము అనగా బైబిలుద్వారా నడిపింపబడుచున్నారు :- ఈ గ్రంథము దైవావేశమువలన గలిగిన గ్రంథము. పరిశుద్ధాత్మ వలన మనుష్యులు దేవుని మూలముగా పలికిన మాటలు అందులో కలవు (1 కొరింధి 2:12, 13; 2 పేతురు 1:21;

2 తిమో 3 : 16). మానవకల్పిత పుస్తకములను వెంబడించువారు దేవుని జనాంగముగా పిలువబడరు.

(8) వారు ఒక ప్రత్యేకమైన సువార్తను బోధింతురు :- సువార్త అను మాటలో క్రీస్తుయొక్క మరణ, సమాధి, పునరుత్థానములు ఇమిడి యున్నవి (1 కొరింథి 15 : 3, 4). వాక్యమును ప్రకటించుము (2 తిమోతి 4 : 2; అపొ. కా. 8 : 4). వాక్యమును ఇతరులకు ప్రకటించవలెనని వారు ఇష్టపడుదురు. వారు వెలుగులో యున్న ప్రకారం చీకటిలో యున్నవారు వెలుగులోనికి రావలెనని ఆశింతురు. క్రీస్తు సువార్త వలననే రక్షణ కలదు (రోమా 1 : 16).

(10) వారు ఒక ప్రత్యేకమైన బోధయందు నిలిచియుందురు :- క్రీస్తు చేసిన బోధలకు వారు కట్టుబడి యుందురు (II : యోహా 9). అపొస్తలుల బోధ యందు నిలిచి యుందురు (అపొ. కా. 2 : 42; 1 తిమో 1 : 3).

(11) ఒక పాపి రక్షింపబడుటకు ఒక ప్రత్యేకమైన మార్గమును తెలియజేతురు :- ఒకడు రక్షింపబడుటకు వాక్యము వినవలెను (రోమా 10 : 17); విశ్వసించవలెను (హెబ్రీ 11 : 1, 6); మారుమనస్సు పొందవలెను (అపొ. కా. 17:30); యేసు దేవుని కుమారుడని నోటితో ఒప్పుకొనవలెను (రోమా 10 : 10; మత్త 10 : 32, 33); పాపక్షమాపణ నిమిత్తము నీటిలో ముంచడము బాప్తిస్మము పొందవలెను (అపొ. కా. 2 : 38).

ఈ ప్రత్యేక ప్రజలు కలిగిన ప్రత్యేకమైన విషయములను చూచినాము. నీవు ఈ ప్రత్యేకమైన జనాంగములో లేనట్లయితే, నీవు నీ పాపములను క్రీస్తులో కడుగుకొని క్రీస్తు సంఘములో చేర్చబడుము. క్రీస్తు తన రాకడలో మనకు ప్రత్యేక స్వరము వినిపించును. ఆయన తన వారికి ప్రత్యేక స్థలమును సిద్ధపరచి యున్నాడు. ★

— దేవరపల్లి చిరంజీవి, కాకినాడ.

# దేవుడు ఏర్పరచుకొన్న ప్రజలు

## (God's Chosen People)

ఏదైనా ప్రాముఖ్యమైన ఉద్యోగానికి తగిన వానిని అధికారులు ఎంచుతారు. సైన్యంలో పని చేయడానికి కుంటివాడు గాని, ప్రాముఖ్యమైన ఉద్యోగానికి పామరుడుగాని ఎంపిక చేయబడడు. ప్రభువుకూడ ఆయా పనులకు ప్రజలను ఏర్పరచుకొన్నాడు. ఓడను నిర్మించుటకు ఆయన నోవహును ఏర్పరచుకొన్నాడు. ఆశీర్వదించుటకు ఆయన అబ్రాహామును ఆయన సంతతిని ఏర్పరచుకొన్నాడు. బానిసత్వము నుండి తన ప్రజలను విడిపించుటకు ఆయన మోషేను ఏర్పరచుకొన్నాడు. ఇశ్రాయేలీయుల 12 గోత్రములలోను ఆయనకు, ఆయన ప్రజలకు పరిచర్య చేయుటకు లేవీయులను ఏర్పరచుకొన్నాడు.

### ఏర్పరచబడిన వారు

యెష్షయి కుమారులలో ఒకని అభిషేకించుటకు ప్రభువు సమూయేలును బెత్లెహేముకు పంపాడు. ఆయన అతని పెద్ద కుమారులను నిరాకరించాడు. ఆయన సమూయేలుకు ఇట్లు చెప్పాడు: "అతని రూపమును అతని యెత్తును లక్ష్యపెట్టకుము. మనుష్యులు లెక్కపెట్టు వానిని యెహోవా లక్ష్యపెట్టడు; నేను అతని త్రోసివేసి యున్నాను. మనుష్యులు పై రూపమును లక్ష్యపెట్టుదురు గాని యెహోవా హృదయమును లక్ష్యపెట్టును" (1 సమూ 16:7). చిన్నవాడైన దావీదు హృదయాన్ని ప్రభువు పరిశీలించి ఇశ్రాయేలు రాజుగా అతని ఎంచుకొన్నాడు. అపొస్తలులుగా యుండుటకు యేసుప్రభువు 12 మందిని, ఆ 12 మందిలో తన రాజ్యద్వారములు తెరచుటకు పేతురును ఏర్పరచుకొన్నాడు. సౌలు క్రైస్తవులను హింసించిన వాడైనను అన్యజనులకు అపొస్తలునిగా ప్రభువతని ఏర్పరచుకొన్నాడు. ప్రభువు

ఏర్పరచుకొనిన వారిలో వీరు కొందరు. వీరు మరణ పర్యంతము ఆయ
నకు నమ్మకముగా యుండిరి.

ఆయా పనులకు ప్రభువు కొందరిని ఏర్పరచుకొన్నను వారిలో
అందరు చివరివరకు నమ్మకముగా యుండలేదు. యాకోబు వంశస్థులు
ఆయన ఏర్పరచుకొన్న ప్రజలే అయినను అవిశ్వాసము అవిధేయత
వలన వారిని దేవుడు నిరాకరించాడు (కీర్తన 105 : 5). "యెహోవా
వారిని త్రోసివేసెను గనుక త్రోసివేయవలసిన వెండియని వారికి పేరు
పెట్టబడును" (యిర్మి 6 : 30).

ఇశ్రాయేలీయుల మొదటి రాజు ఆయన ఏర్పరచుకొన్నవాడే.
జనులందరిలో యెహోవా ఏర్పరచిన వానిని చూడుడి. అతనివంటి
వాడొకడును లేడని సమూయేలు అతని గూర్చి ఇశ్రాయేలీయులకు
చెప్పాడు (1 సమూ 10 : 24). సౌలు ఇశ్రాయేలు రాజుగా 40 సంవ
త్సరములు పాలించాడు. యెహోవా ఆజ్ఞాపించినట్లు అమాలేకీయులను
అతడు బొత్తిగా నాశనము చేయనందున ఆయన అతన్ని త్రోసి
వుచ్చాడు (1 సమూ 16 : 1). సౌలు తరువాత ఆయన దావీదును
రాజుగా ఎంచుకొన్నాడు. అతడాయన దృష్టిలో నీతిగా నడుచు
కొన్నాడు. అతని తరువాత అతని కుమారులలో ఒకడైన సొలోమో
నును రాజుగా ఆయన ఎంచుకొన్నాడు. దేవుడతనికి ఐశ్వర్యము,
జ్ఞానము, సంపద, శాంతిననుగ్రహించి ఆశీర్వదించాడు. అయితే
అతడు వృద్ధుడయ్యేసరికి అన్యజనులలో నుండి వచ్చిన తన భార్యలతో
విగ్రహారాధన చేసాడు. దేవుడతని తిరస్కరించి ఇశ్రాయేలు రాజ్య
మును అతనినుండి తొలగించాడు. అయినను దావీదును బట్టి ఇశ్రా
యేలులో కొద్దిమంది మాత్రము దావీదు సంతతినిబట్టి ఏలుబడి చేయ
బడ్డారు. ఈ రీతిగా ముందు వారు ఏర్పరచుకొనబడిన వారైనను వారి
అవిధేయతను బట్టి ప్రజలు తమ ఆశీర్వాదములను కోల్పోయినట్టు
చూడగలము.

## పిలువబడినవారు

'పిలువబడినవారితో' సంఘము సమకూడియున్నది. అనేకులు పిలువబడినను, ఏర్పరచబడువారు కొందరే యని బైబిలు చెప్పుచున్నది. ప్రభువు పై స్వరూపమును గాక, హృదయాంతర్యమును పరిశీలించును. అది దావీదు కాలములో సత్యము, ఇప్పుడు కూడ సత్యము. మీరు ఏర్పరచబడిన వంశమని 1 పేతురు 2:9 చెప్పుచున్నది. మనము పరిశుద్ధులుగను, నిర్దోషులుగను ఉండుటకై జగత్పునాది వేయబడక ముందే ఏర్పరచబడిన వారమని పౌలు చెప్పుచున్నాడు (ఎఫె 1:4). మన క్రియలనుబట్టి గాక, ఆయన కృపాసంకల్పమును బట్టి ఆయన మనలను ఏర్పరచుకొనెనని లేఖనము చెప్పుచున్నది. క్రైస్తవులు అబ్రాహాము, మోషే, దావీదులవలె అంతము వరకు నమ్మకముగా నిలిచి యుండాలి. మధ్యలో పడిపోయిన యెడల ఇశ్రాయేలు, సౌలు, సొలొమోనులవలె ఆయన మనల్ని నిరాకరిస్తాడు.

## అపవాదినిగూర్చిన జాగ్రత్త

అపవాది ఎవని మ్రింగుదునా యని వెదకుచు తిరుగుచున్నాడు. ఏర్పాటు చేయబడని వాని కొరకు గాక ప్రభువు దృష్టిలో నమ్మకముగా నడుచుకొనువాని కొరకు అతడు తిరుగుచున్నాడు. ప్రభువుయొక్క ఆశీర్వాదములు పొందకుండా పడిపోవునట్లు అపవాది చేస్తాడు. అవిధేయత, అవిశ్వాసము, నిర్లక్ష్యము వలన క్రైస్తవుడు తన ఆశీర్వాదమును కోల్పోతాడు. మనము పడిపోకుండునట్లు పేతురు మనకొక మార్గమును చూపుచున్నాడు: "ఆ హేతువుచేతనే మీరు మట్టుకు మీరు పూర్ణ జాగ్రత్తగలవారై మీ విశ్వాసమునందు సద్గుణమును, సద్గుణమునందు జ్ఞానమును, జ్ఞానమునందు ఆశానిగ్రహమును, ఆశానిగ్రహమునందు సహనమును, సహనమునందు భక్తిని, భక్తియందు సహోదర ప్రేమను, సహోదర ప్రేమయందు దయను అమర్చుకొనుడి.

ఇవి మీకు కలిగి విస్తరించినయెడల అవి మన ప్రభువైన యేసు క్రీస్తును గూర్చిన అనుభవజ్ఞానములో మిమ్మును సోమరులైనను నిష్ఫలులైనను కాకుండ చేయును. ఇవి ఎవనికి లేకపోవునో వాడు తన పూర్వ పాపములకు శుద్ధి కలిగిన సంగతి మరచిపోయి గ్రుడ్డివాడును దూరదృష్టి లేనివాడునగును" (2 పేతు 1:5-10). పేతురు చెప్పిన ఈ సద్గుణములను అలవరచుకొనుట ద్వారా మనము పిలువబడిన పిలుపుకు తగినట్లుగా నడుచుకొందము గాక ! (ఎఫెసీ 4:3).

—కవిత గూటం, కాకినాడ.

---

## క్రీస్తువారి రెండవ రాకడ

—విక్టర్ డి. తురాక, తెనాలి.

**1. A)** క్రీస్తువారి రాకడను గూర్చిన వాగ్దానములు: నేను మరల వచ్చెదనని క్రీస్తువారు చెప్పిరి (యోహాను 14 : 1-3). ఆయన మరల వచ్చునని దేవదూతలు తెల్పిరి (అ.కా. 1 : 10-11). ఆయన వచ్చునని పరిశుద్ధాత్ముడు తెల్పెను (హెబ్రీ 9 : 27-28). పైన తెలుపబడిన ముగ్గురి సాక్ష్యము వలన క్రీస్తువారు మరల వత్తురని మనకు దృఢ విశ్వాసము కలుగుచున్నది.

**B)** రెండవ రాకడను గూర్చి కొన్ని మానవ సిద్ధాంతములు: ఇవిగో రాకడ గుర్తులు, యివి నెరవేరుచున్నవి, గనుక త్వరలో క్రీస్తు రాబోవుచున్నాడని, దానికి తేదీలుగూడా నిర్ణయించిరి. విలియం మిల్లరు అను నాతడు ఎలెన్ జి. వైట్ అను నామె ప్రవచనములను నమ్మి "సెవెంత్ - డే - ఎడ్వెంటిస్టు" అను మతశాఖను స్థాపించెను. అతడు రెండవ రాకడకు 1843 సం॥ నిర్ణయించి విఫలము పొందెను. మరల 1844 వ సం॥నకు మార్చెను. 1844లో వారు నిర్ణయించిన నెల, రోజు రానే వచ్చెను. గాని క్రీస్తువారే రాలేదు. లెక్కలలో తప్పి

వచ్చినదని 1845 కు మార్చెను. యింత జరిగినను విలియం మిల్లరులో నమ్మకమున్నవారు 1845లో నిర్ణయించిన దినమునకు ముందుగానే, క్రీస్తు వారిని కలుసుకొనవలెనని తెల్లని వస్త్రములు ధరించి, కొండలను, గుట్టలను, ఎత్తైన చెట్లను, యిళ్ళ కప్పులను ఎక్కి కూర్చుండిరి. "రాకడను" కనిపెట్టుచుండిరి. ప్రొద్దు క్రుంకినది. క్రీస్తువారు రాలేదు. రాత్రికి నిరాశ జెందిరి యిండ్లకు తిరిగి వచ్చిరి. బైబిలును సరిగా అర్థము చేసికొనక పోవుటయే వారి అజ్ఞానమునకు కారణము. తరువాత చార్లెస్ టి. రస్సెల్ అను పాస్టరు 1914 వ సం॥ అక్టోబరు నెలలో 'రాకడ' జరుగునని నిర్ణయించెను. ప్రస్తుత లోక సంగతులు అంతమై త్వరలో "వెయ్యేండ్ల పాలన" ఆరంభమగుననియు, దానికి సిద్ధపడవలెనని తన మతశాఖలోని వారికి బోధించెను. వారందరు అతని మాట ప్రకారము, ఆ దినమున పిల్లలను బడులకు పంపలేదు, వారును పనులకు వెళ్ళలేదు. కొందరు యిరుగు పొరుగు వారిని కూడా ఆపి "రాకడకు" సిద్ధపడమనిరి. కాని క్రీస్తువారు రాలేదు. గనుక రస్సెల్ 1918కి మార్చెను. అంతలో మొదటి ప్రపంచ యుద్ధము జరిగెను. తరువాత రస్సెల్ చనిపోయెను. ప్రజలు అతని సంగతి మరచిపోయిరి. అతని తరువాత జె. యఫ్ రూథర్‌ఫోర్డు, రస్సెల్ సంగతులను తిరుగదోడెను. "అతని కాలములో ప్రజ లెవ్వరు మరణము పొందరనియు, వున్నపాటున 'వెయ్యేండ్ల పరిపాలనలో' పాల్గొందురు గనుక సిద్ధపడుడని" బోధించెను. అనేకులు నమ్మిరి. గాని రెండవ రాకడ చూడకుండగనే అతడు చనిపోయెను. తరువాత మేరీ బేకర్ గ్లోవర్ ప్యాటర్‌సన్ ఎడ్డి అను, "క్రిస్టియన్ సైన్సు గ్రూపునకు చెందిన ఆమె 1865 లో, తనకు మరణము లేదని చెప్పుకొనుచు తన 96 వ యేట మరణించెను. వీరందరు 'క్రీస్తు వారి రెండవ రాకడలో వెయ్యేండ్లు భూలోక పరిపాలన', 'అర్మెగిదోను యుద్ధము'ను గూర్చి విశ్వసించి, యితరులచేత విశ్వసింపజేసి అవి చూడకుండగనే చనిపోయిరి. అదే మిక్కిలి విచారకరమైన సంగతి.

C) క్రీస్తువారి రాకడకు గుర్తులు ఏమైన వున్నవా ! కొందరు మత్తయి 24వ అధ్యాయము చదివి, అవే గుర్తులని భావించుచున్నారు. మత్తయి 24, మార్కు 13, లూకా 21వ అధ్యాయములు ఒక విషయమును గూర్చి తెలుపుచున్నవి. అదే - యెరూషలేము నాశనమును గూర్చి. పై మూడు అధ్యాయములలో క్రీస్తువారు, తన శిష్యులు అడిగిన మూడు ప్రశ్నలకు (మత్తయి 24:3, మార్కు 13.4, లూకా 21:7) జవాబులు యిచ్చెను. గాని ఆయన రాకడను గూర్చి క్రీస్తువారు స్పష్టముగా తెలియజేసిన దేమనగా - "అయితే, ఆ దినమును గూర్చియు, ఆ గడియను గూర్చియు, తండ్రి మాత్రమే ఎరుగును గాని, యే మనుష్యుడైనను, పరలోకమందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగరు" (మత్త 24:36). - "ఏదినమున ప్రభువు వచ్చునో మీకు తెలియదు గనుక మెళుకువగా వుండుడి (మత్తయి 24:42)." "మీరనుకొనని గడియలో మనుష్య కుమారుడు వచ్చును (మత్తయి 24:44)."

"జలప్రళయము వచ్చి అందరిని కొట్టుకొనిపోవు వరకు ఎరుగక పోయిరి; ఆలాగునే మనుష్య కుమారుని రాకడ వుండును" (మత్తయి 24:39). గనుక మత్తయి 24వ అధ్యాయములోని గుర్తులు, సూచనలన్నియు 'రాకడకు' కాదు గాని, యెరూషలేము నాశనమునకు మాత్రమే సూచనలుగా యున్నవి. "ఇవన్నియు జరుగు వరకు ఈ తరము గతించదు (మత్తయి 24:34)."

చరిత్ర ప్రకారము క్రీ॥శ॥ 70లో అవన్నియు, ఏదియు తప్పిపోకుండా జరిగినట్లు మనము తెలిసికొనుచున్నాము. అవన్నియు అప్పటి తరములోనే నెరవేరినవి.

మత్తయి 24:15 - లో, "నాశనకరమైన హేయవస్తువు పరిశుద్ధ స్థలమందు నిలచుట మీరు చూడగనే" అని, దానియేలు ప్రవక్త యొక్క ప్రవచనము (దాని 12:11, 9:27). నెరవేర్పును గూర్చి క్రీస్తు

వారు తెలిపిరి. "అప్పుడు యూదయలో వుండువారు కొండలకు పారి పోవలెను (మత్తయి 24:16)." "పొలములో వుండువాడు బట్టలు తీసి కొని పోవుటకు యింటికి రాకూడదు (మత్తయి 24:18)." పై సంగతులు రెండవ రాకడ సమయములో అయితే కొండలకు పారిపోవుట ఎందుకు? యింటిలోని బట్టలెందుకు? మత్తయి 24:19-22, మార్కు 13:17-20, లూకా 21:23-28లో వివరించబడిన శ్రమ లన్నియు క్రీ॥శ॥ 70లో యెరూషలేము నివాసులకు జరిగినట్లు చరిత్రకారులైన జోసిఫస్, ప్లినీలు చక్కగా వివరించిరి. ఆ విధముగా యెరూషలేము నాశనమగుట, దేవాలయము పడద్రోయబడుట వలన ధర్మశాస్త్ర యుగము సమాప్తమై, క్రీస్తు యుగము ప్రారంభమై క్రీస్తే రాజుగా, పరిపాలన ఆరంభమాయెనని లోకమంతటికి ఒక గుర్తుగా చూపబడినట్లును, అట్టి గుర్తును మీరు చూతురని, క్రీస్తువారు - ప్రధాన యాజకునికి యూదులకు, శాస్త్రిలకు చెప్పిన మాటలలోని (i) (మత్తయి 26:64, లూకా 21:31) అర్థము. అవన్నియు అప్పుడు వారు చూచిరి కదా?

"ఆ దినముల శ్రమ ముగిసిన వెంటనే (మత్తయి 24:29)" అను మాటలు 'వెయ్యేండ్ల పాలన' వారి సిద్ధాంత ప్రకారము పరిశుద్ధుల సంఘము ఎత్తబడిన తరువాత జరుగు శ్రమలనియు, ఈ శ్రమ కాలములో పరిశుద్ధులు క్రీస్తుతో కూడ ఆకాశములో ఎచ్చటో వుందురని- శ్రమ ముగిసిన తరువాత వారందరు క్రీస్తుతో గూడ భూమిమీదకు వెయ్యేండ్ల పరిపాలన చేయుటకు దిగివత్తురని చెప్పుదురు. కాని, మత్తయి 24:16 ప్రకారము పరిశుద్ధులు కొండలకు పారిపోవలెను గదా? ఎత్తబడిన పరిశుద్ధు లెవరు? కొండలకు పారిపోయిన దెవరు?

(ii) మత్తయి 24:29 లోని "చీకటి సూర్యుని కమ్మును, చంద్రుడు కాంతి నియ్యడు, ఆకాశమునుండి నక్షత్రములు రాలును, ఆకాశమండలి శక్తులు కదలింపబడును." అనునవి అక్షరార్థముగా జరుగునవి కావు. ఎందుకనగా, పాతనిబంధనలో, ఒక గొప్ప పట్టణము

నాశనమగునప్పుడు అట్టిమాటలు వాడుట హెబ్రీ ఆచారముగా నున్నది. యెషయ 13:10లో బబులోను నాశనమును గూర్చి చెప్పబడినప్పుడును, యెషయ 24:23లో తూరు పట్టణము నాశనము, యెషయ 34:4లో ఎదోము నాశనము గూర్చియు, యెహెజ్కేలు 32:7లో ఐగుప్తు నాశనమును, యోవేలు 2:30-32లో యెరూషలేము నాశనమునుగూర్చి చెప్పినప్పుడు అవే మాటలు వాడిరి. మత్తయి 24:29లో వాటి భావ మేమనగా - ఇశ్రాయేలీయుల పరిశుద్ధ స్థలమైన "సూర్యుడు" యిక ప్రకాశింపకపోవును; యూదా జనాంగమైన "చంద్రుడు" కాంతి నియ్యడు, ఎందుకనగా చంపబడిన లక్షలాది మంది రక్తము యెరూషలేము వీధులలో ప్రవహించును; "సన్హెడ్రిన్" సభలోని 70 మంది సభ్యులను 'నక్షత్రములు' వారి అంతస్తునుండి నేల రాలుదురు. ఈ విధముగా ఏదియు తప్పిపోకుండా జరిగినట్లును-అప్పుడు ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయు వారు రక్షింపబడుదురు (అ.కా. 2:21) అనునది నెరవేరుటకు "పరిశుద్ధులు కొండలకు పారిపోయి రక్షింపబడినట్లు చరిత్ర ఆధారములున్నవి." [సశేషం

---

Regd. No. H/KD—45/KD.H.O.

From
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

No.

To

..............................

..............................

..............................

..............................